# పెద్దోళ్ళు

— బొడ్డ కూర్మా రావు

కిష్టయ్యకి రెండు కళ్ళూ చాలటం లేదు, మతి పోతోంది. ఆశ్చర్యం ఆనందం ఒకేసారి విందు కున్నాయి. అంత అలసటలో కూడా ఇంద్ర భవనంలా మెరిసిపోతున్న ఆ భవనాన్నీ ఆ వైభ వాన్నీ కన్నుల విందా చూస్తున్నాడు.

ఎంత సందడి!... ఎంత సంబరం!...

బంగ్లా దేదీ ప్యమానంగా వెలిగిపోతోంది. రంగు రంగుల దీపాలు ఆరీ వెలుగుతుంటే నక్షత్రాలు దిగి వచ్చినట్టుగా వుంది. ఆ ప్రాంతంలో అలాంటి పెళ్ళి ఎప్పుడూ జరగలేదు.

అక్కడ కారులు బారులు తీరి వున్నాయి. స్కూటర్లు చీమోల్లా చిక్కగా వరుస కట్టు న్నాయి. ఎక్కడ చూసినా పంచెలు, కళ్ళీ లాల్చీలే కనిపిస్తున్నాయి. మడతలు నలగని పట్టు వోణీలు, ఖద్దరు బట్టలే సాక్షాత్కరిస్తున్నాయి.

నేల ఈనినట్టు జనం. రావలసిన వాళ్ళు ఇంకా చాలా మందున్నారు. వచ్చే వాళ్ళు మధ్యాహ్నం రెండు గంటల నుంచే ప్రారంభమైనారు.

కిష్టయ్య ఆ జనాన్ని చూస్తున్న సందడిలోతన కష్టాన్నే మర్చిపోయాడు......

ఎం.ఎల్.ఏ. గారు పెళ్ళికి పిలిచారని క్రితం రోజు పెదనాయుడు చెప్పగానే చాలా ఆనందిం చాడు కృష్టయ్య. 'లొండాడు' కూడా వస్తున్నా డంటే మరీ ఆనందించాడు. ఎందుకంటే వాళ్ళిద్దరూ రామరాజపురంలో మంచి నేస్తాలు.


రామరాజపురం నుండి 'లొండెలక్ష్మయ్య', పెదనాయుడు, కిష్టయ్య బయల్దేరారు.

పెళ్ళి రోజు ఉదయానికే ఎం.ఎల్.ఏ. ఇంటి దగ్గర వుండాలని 'లక్ష్మయ్య'నీ, కిష్టయ్యనీ ఉత్సాహ పరచి వాళ్ళ పంచాయతీ తరపున రెండు బస్తాల బియ్యం, ఓ వెయ్యి న్నూట పదహార్లూ వసూలు చేసి కోడి కూయకముందే ప్రయాణం కట్టిం చాడు పెదనాయుడు.

పెళ్ళి బాధ్యతంతా పెదనాయుడు పైనే వేసొన్నారు. ఎం.ఎల్.ఏ. ఒక్కగానొక్క కూతురు పెళ్ళి పట్నంలో అతి వైభవంగా చేద్దా మనుకున్నారు. కానీ వాళ్ళ ముసలమ్మ స్వస్థలంలో సొంత ఇంటిలోనే చెయ్యమని పట్టు పట్టింది. కూతురు పెళ్ళి సొంత వూర్లోనే వేయక తప్పింది కాదు ఎం.ఎల్.ఏ. పరుశురాం గారికి.

ఎం.ఎల్.ఏ. పరుశురాం గారికి పెద నాయుడు కుడి భుజం. పెళ్ళి బాధ్యతలు నిర్వ ర్తించడానికి వారం రోజులు నుంచి నిద్రాహారాలు మానేసి అన్నీ సమకూర్చుతున్నాడు పెద నాయుడు.

పెదనాయుడు వూరికే, ఎం.ఎల్.ఏ. పరు



శురాం గారి వూరికీ ఐదు కిలో మీటర్ల దూరం వుంటుంది. ఈ దూరమంతా నాటు దారినే రావాలి. రామరాజపురంలో వసూలు చేసిన రెండు బస్తాల బియ్యం, నాలుగు మూటలు చేసి 'లొండాడు', కిష్టయ్య రెండు కావిళ్ళెత్తుకున్నారు.

"...... అయితే నాను బండి మీదెళ్ళి అక్కయ్యపల్లి సెంటర్లో వుంతాను. మీరు బేగెలిపి రాయండి" అని పెదనాయుడు చలాగ్గా లూనా ఎక్కేసాడు.

ఎం.ఎల్.ఏ. అంతటోడు పెళ్ళికి పిలిచాడనే ఉత్సాహంతో 'లొండాడూ', కిష్టయ్య కావిళ్ళు మోస్తున్నారు. అక్కడక్కడా ఆగి, సుట్టలు కాల్చుకొని అంచలంచెలుగా కావిళ్ళు భజాలు మారుస్తున్నారు. మధ్యలో తెలిసినోళ్ళు ఎవరైనా 'ఎక్కడకని' అడిగితే ఎం.ఎల్.ఏ. ఇంటి పెళ్ళి కని గర్వంగా చెపుతూ వెళ్తున్నారు. 'లొండా లక్ష్మయ్య'కి పెద్దవాళ్ళ పెళ్ళి కార్యానికి వెళ్ళటం ఇదేమొదటిసారి. అందునా ప్రెసిడెంట్ అయినాక కూడా రాజకీయ నాయకుల పెళ్ళికి వెళ్ళటం కూడా ఇదే ప్రథమం.

జంక్షన్‌లో పెదనాయుడ్ని చూసి ఆనందంతో వాళ్ళ కళ్ళు మెరిసాయి. కావిళ్ళు దించి గట్టిగా వూపిరి పీల్చుకున్నారు. తల పాగాలుతీసి ముఖాలు తుడుచుకున్నారు.

"వచ్చి సినారా...... మరింకెంతో నేదు. అల్లదిగో కనిపిస్తంది. అదే!, అక్కయ్యపల్లి బేగెలిపి రాయండి. ఇల్లే కంకర రోడ్డంట తిన్నగా ఒకటే తోవ." అని వాళ్ళకి డైరెక్షన్ ఇచ్చి అక్కయ్య పల్లి కేసిబండి పోనిచ్చాడు నాయుడు.

వీళ్ళు కావిళ్ళు వూపుకుంటూ ఎం.ఎల్.ఏ. వూరు కాసి నడుస్తున్నారు.

అక్కయ్యపల్లి చిన్న పల్లెటూరు. అదిగో అన్నట్టు కనబడుతోంది గానీ డొంకల్లోంచి అదీ ఓ కిలో మీటరుంటుంది. ఊర్లో ఒక్క పరుశురాం గారి బంగ్లా తప్పితే మిగిలినవన్నీ పూరి పాకలు, రెండే పెంకుటిళ్ళు.

ఈ వూరంతా నాదేనని చాటుతున్నట్టు వూరికి మొదట్లోనే పరుశురాంగారి బంగ్లా.

బంగ్లాకి పెద్ద వరండా, వరండా కానుకొని అడ్డంగా మూడు గదులు. ఆ గదుల మీద డాబా గదులు. గదులు తరువాత మధ్యన లోగిలి. లోగిలి తరువాత మళ్ళీమూడుపెద్ద గదులు వాటి

> చాకిరీ చేయించేవాళ్ళు ఒక రకం పెద్ద వాళ్ళయితే, ఆ చాకిరీ సారాన్ని నీడ నుంచి పీల్చుకుంటూనే, చాకిరీ చేసే వాళ్ళ నీడ పడనంత దూరంలో వుండేవాళ్ళు ఇంకో రకం పెద్దవాళ్ళు! వీళ్ళు వాళ్ళు తమకు చాకిరీ చేయడానికే వున్నారని వాళ్ళు అనుకుంటూ వుంటారు. అప్పుడప్పుడూ లోక రక్షణార్థం దేవతలు భువికి దిగివచ్చినట్టు వచ్చి, చాకిరీ చేసేవాళ్ళను చిరునవ్వుల్తో అనుగ్రహిస్తుంటారు. చిరునవ్వుతో కూడా పన్లేదనుకుంటే. ఆ మాత్రం శ్రమ కూడా పడరు.

నానుకొని కొన్ని చిన్న గదులు. ఆ తరువాత మైదానం లాంటి పెద్దపెరడు, పెరట్లో ఈశాన్యం మూలను బోరింగ్. దాని ప్రక్కనే పశువుల శాల. గడ్డి వాములు.

ఆ భవనం పరుశురాం తాతగారి హయ్యాంలో కట్టింది. అప్పట్లో వాళ్ళకి సంబంధించిన పనులు చేసేందుకు కొన్ని కుటుంబాలు అక్కడ నివాసానికొచ్చేసాయి. వాళ్ళంతా ఇప్పుడు యాభై అరవై కుటుంబాలుగా పెరిగిపోయి చిన్న పల్లెటూరై పోయింది.

జమిందారీలు పోయిన తరువాత ప్రజాస్వామ్య పాలన ప్రవేశించాక పరుశురాం గారి నాన్నగారుఆ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించే ఎం.పి. అయ్యారు.

రాజు కొడుకు రాజైనట్టు ఆ ప్రాంతం ఆధిపత్యం నాడూ నేడూ వాళ్ళ చేతులు వీడిపోలేదు. ఈరెండు తరాలూ పదవుల్లో వుండడంతో వాళ్ళ కుటుంబాలు తరచూ చెన్నైలోనో, రాజధానుల్లోనో వుండేవి.

పెళ్ళి స్వగృహంలో ఛెయ్యటానికి వాళ్ళంతా వచ్చారు. ఇక్కడున్నన్నాళ్ళూ పట్నంలో వున్న సదుపాయాలన్నీ అమర్చాలని పెదనాయుడి తాపత్రయం. చాలా మంది ప్రముఖులు వస్తారని వాళ్ళకు బసలు వాళ్ళకు తగ్గట్టుగా ఏర్పాటు చేస్తున్నారు.

పెదనాయుడు బండి దిగేసరికి పరుశురాం గారు ఫ్రెష్ వేస్తూ కనిపించారు. అప్పుడప్పుడే సూర్యుడు పైకొస్తున్నాడు. ద్వారాలకు తోరణాలు కడుతున్నారు.

పాత భవనం కొత్త అలంకారాలతో కళకళలాడుతూ ముసలి ముత్తైదువలా వుంది.

"ఏమయ్యా! రాత్రికే వచ్చేస్తానన్నావు?" పలకరించారు పరుశురాం.

"అన్నీ సజ్జులేసి బయల్దేరతైటికి ఇయ్యాలయింది" అంటూ చెప్పులు వరండా వెలుపల విడిచి లోనకు వెళ్ళాడు పెదనాయుడు.

వరండాలో వరుసగా ఓ యాభై అరవై కుర్చీలు వేసున్నారు. రెండు సోఫా సెట్లున్నాయి. సింహాసనం లాంటి ఓ ఆసనం వరండా మధ్యనుంది. ఆ ఆసనంలో కూర్చుంటే మిగిలిన కుర్చీలన్నీ స్పష్టంగా కనిపిస్తాయి. మొత్తం వరండా రాజ దర్బారులా వుంది.

వచ్చిన దగ్గర దగ్గర చుట్టాలు బంధువులతో అప్పుడే ఇళ్ళు పూర్ణ గర్భిణీలా వుంది.

లారీ వచ్చిందని ఎవరో పై నుండి కేకలేసారు.

ఇద్దరు ముగ్గుర్ని కూడగట్టుకొనిలారీ దగ్గర కొచ్చాడు పెదనాయుడు. లారీలోని షామియానాలు, వంట సామాన్లు, కుర్చీలు వగైరా వస్తువులు దింపించాడు.

సామాన్లు దింపి లారీ వెళ్ళేసరికి బస్తాలు మోస్తూ 'లొండాడు' కిష్టయ్య వచ్చారు.

"రాయండి... రాయండి' అంటూ ఎదురెళ్లాడు పెదనాయుడు .

పరుశురాం గారు ఎవర్తోనో మాట్లాడుతున్నారు. కొంతమంది షామియానాను మేడ పైకి తీసుకెళ్తున్నారు. కొందరు కుర్చీలు సర్దుతున్నారు.

రేవిఎండలో 'లొండాడు', కిష్టయ్య చమట్లు కక్కుకొని కావిడి దించారు. వీళ్ళను చూసిన పరుశురాం వీళ్ల వైపుగా రాలేదు. కానీ వీళ్ళు మాత్రం తల పాగాలు తీసి దూరం నుంచే అతి వినయంగా రెండు చేతులూ జోడించి నమస్కరించారు ఎం.ఎల్.ఏ. గారికి.

పరుశురాం తల పంకించీ పంకించకుండానే చిరునవ్వు నవ్వారు. పరుశురాం నవ్వగానే లొండాడు, కిష్టయ్య ఉబ్బితబ్బిబైపోయారు.

"అరేయ్... మీరు కావిళ్ళు అల్లా మూలెట్టి ఇక్కడ కూకోయండి. టీనీలు పంపిస్తాను. తరువాత యేటి సెయ్యాలో సెప్తాను" అని పెదనాయుడు చెప్పాడు.

వీథి వాకిట్లో వచ్చి పోయే వాళ్ళను చూస్తూ కారే చెమటను తుడుచుకుంటూ 'లొండాడు', కిష్టయ్య కూర్చున్నారు.

షామియానా వాకిట్లో ఎత్తుతున్నారు.

పటిష్టమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్

"ఇల్లీ తాడు అందడం లేదు మీరందుకో యండి" అని 'లక్ష్మయ్య'ను ఒకతను పిలిచాడు.

"లక్ష్మయ్య" మంచి పొడుగైన మనిషి. మంచి బలమైన మనిషి కూడా. సదా పంచెకట్టడు. బనియను కూడా వెయ్యడు. పెళ్ళికి రావడంతో పంచె కట్టాడు. కొత్త బనియను వేసుకొచ్చాడు. అక్కడక్కడా ఒకటి రెండు తల వెంట్రుకలు నెరసినట్టు కనిపిస్తుంటాయి.

"పొడుగైతే ఇదే నాభం" అని షామియానాను 'లొండాడే' కట్టాడు.

వాకిట్లో షామియానా లేచేసరికి పెళ్ళి గడప కొచ్చినట్టుగా వుంది. తెచ్చిన కుర్చీలన్నీ చకచకా షామియానా క్రిందను సర్దేశారు.

గాబరా గాబరాగా తిరుగుతూ "మీకు టీ వచ్చిందా" అని మళ్ళీ పెదనాయుడు కనిపించాడు.

'లక్ష్మయ్య', కిష్టయ్య తెల్ల మొగాలేశారు.


"సరి సరే... రాయండి ఇల్లీ పక్కనుండి పెరటికి పొరాయండి" అని పెరట వైపుకు వెళ్ళే సందు చూపించి తను ఇంట్లోంచి పెరటకు వెళ్ళాడు. వీళ్ళిద్దరూ నాయుడు చూపించిన సందులోంచి పెరటు వైపుకు వెళ్ళారు. అక్కడ మరిగి మరిగి ఏదో వాసన వేస్తున్న టీ రెండు సిలవరి గళాసుల్లో ఇచ్చారు.

వాళ్ళిచ్చిన టీ నీళ్ళు తాగుతూ మట్టూ చూస్తున్నారు.

విశాలమైన పెరట్లో ఒక మూలకు ఆరడుగుల పొడవున జోరీ పొయ్యి తీసున్నారు. దాని మీద ఒకేసారి పెద్ద పెద్ద పాత్రలతోఎన్నైనా వంటలు చేసుకోవచ్చును. పొయ్యి తవ్వుతున్న వాళ్ళంతా అక్కయ్య పల్లె గ్రామస్థులే - వంట బ్రాహ్మలు వాళ్ళకు సూచనలిస్తున్నారు. పొయ్యికి అల్లంత దూరంలో ఓ పెద్ద గూన వుంది. ఆ గూనలో ఓ యాభై అరవై కావుళ్ళ నీరు పడుతుంది. భోజనాలైనాక చేతులు కడుక్కోటానికి ఆ గూన దగ్గర ఏర్పాటు చేశారు.

"అరేయ్... 'లొండా'! ఎలగ మనం కావిళ్ళు తెచ్చున్నాము కదా! ఇంకో మనిషికిస్తాను. మొత్తం మీ ముగ్గురు కలిసి ఆ గూన నింపేయండి. మరో జట్టు తాగడానికి నీరు తెస్తారు."

"...... నూతి దగ్గరకు మీరెవళూ యెళ్ళకండి. అక్కడో ముగ్గుర్ని వుంచున్నాము. ఆళే తోడుతారు. మీ వొంతంతా నీళ్ళు మోసిడమే!" అదేం పెద్ద శ్రమ కానట్టు తేల్చేస్తూ బిందెలు అప్పజెప్పేరంగడ్ని తోడిచ్చాడు.



నిద్ర

**క్యూబాలో టోమాస్ ఇజ్క్యు అర్గో అనే ఆసామి ఉన్నాడు. ఆయనగారు 40 సం.ల పాటు నిద్ర పోకుండా బతుకు బండి లాగించాడు! నిద్రపట్టడానికి ఎన్ని మందులైతే ఉన్నాయో అన్నీ వాడేడు. ఆకు పంక్చర్ విధానం అవలంబించాడు. ఎలక్ట్రిక్ షాక్‌లు తీసుకొన్నాడు. అయినా ప్రయోజనం లేకపోయింది. పాపం అతనికి నిద్రే పట్టలేదు! నిద్రపట్టకపోవడం అనేది ఎంత భయంకర శాపమో గదా!**

—కొడిమెల

రంగడు మంచి మరుకైన కుర్రోడులా కనిపించాడు 'లక్ష్మయ్య'కి.

అన్నీ వున్నాయి కానీ అల్లుడి నోటిలో శనుందన్నట్టు ఆ వూరికి హంగులన్నీ వున్నా నీరు మాత్రం కరవు. పరుశురాం గారింట్లో బోరింగు వుంది. కానీ పాడైపోయింది. మరి బాగు చెయ్యలేదు. బాగు చేసేంత అవసరం వాళ్ళకి రాలేదు. రావటానికి వాళ్ళెప్పుడు ఆ వూళ్ళో వున్నారనీ! పైగా అది పని చేస్తే వూరంతా వాళ్ళ పెరట్లోనే వుంటారు. చెత్త చెత్త చేసేస్తారా లోగిలి. అదొక పెద్ద తల నొప్పి. అందుకోసం బోరింగు బాగు చేసే ప్రయత్నం చెయ్యలేదు.

ఆరుగురు ఆరుగుర్నిరెండు గ్రూపులుగా విడదీసి ఒక గ్రూపు తాగడానికీ వంటకీ నీరు సప్లై చేస్తే, రెండో గ్రూపు చేతులు కడుక్కోటానికి పెదనాయుడు తెలివిగా ఏర్పాటు చేశాడు.

నీళ్ళు మోసేందుకు గ్రూపులు తయారైనాయి. కావుళ్ళు పట్టుకొని సందడిగా బయల్దేరారు. నుయ్యి ఒక ఫర్లాంగు దూరంలో ఆ వూరు శివ కోవిల ఎదురుగా వుంది. కోవిలకి వూరికి మధ్యన కొబ్బరి తోట. అదంతా ఇసుక దారి.

రాత్రి పడ్డ మంచుకు తడి తడిగా వుంది తోవ. సూర్య రశ్మి తగిలి నెమ్మదిగా పొడి పొడి అవుతోంది. కాళ్లకు అంటీ అంటనట్టుంది మట్టి.

'సిద్ధాంతి' ఎప్పుడు పెట్టిందీ, ఏయే బంధువులు ఎప్పుడొచ్చిందీ, కట్నాలు, కానుకలు పెళ్ళి మేనేజిమెంటు ఎవరెవరు చేస్తున్నదీ వగైరా విషయాలన్నీ భాగా తెలిసినోళ్ళు చెపుతుంటే 'లక్ష్మయ్య', కిష్టయ్య వింటున్నారు.

"రంలకి కులం పట్టింపులు లేవుగావల్ల. అందరికీ పిలిసేస్తున్నారు" అని కిష్టయ్య సందేహం వ్యక్తం చేశాడు.

"ఇప్పుడందరూ అందరికీ పిలిసేస్తున్నారు. కులం పట్టొగ్గేసింది. కులం పట్టుకొని యపులు కూకోయున్నారు?" అని రంగడంటే దానికి లక్ష్మయ్య 'అవునా'న్నాడు.

పెదనాయుడు మేనేజిమెంటు కోసం చాలా చెప్పుకున్నారు. రామరాజపురం ప్రెసిడెంట్ పెద్ద నాయుడుదే రః పెళ్ళి బాధ్యతంతాని చెపుతుంటే......

"రామ రాజపురంకి రిజర్వుడు ప్రెసిడెంటు గావాల?" అని మలొకరు అనుమానం వ్యక్తం చేశారు.

"ఆ... వున్నాడు హరిజనుడు. కానీ ఏటి లాభం పెదనాయుడు 'ఉ' అంటే 'ఉ'... 'ఆ' అంటే 'ఆ'. పెదనాయుడు మాజీ ప్రెసిడెంటు, ఆ వూరి మోతు బరి. ఆయన గారి మాట కాదని ఆడేటి సేసుకోగలడు? పేరుకే రిజర్వు ప్రెసిడెంటు. పెత్తన 'మంతా పెదనాయుడుదే'...... అన్న మాటలకు 'లక్ష్మయ్య' మౌనంగా వుండిపోయాడు.

కిష్టయ్య ఏదో అనబోయాడు కానీ 'లక్ష్మయ్య' కళ్ళలోకి చూసి ఏమీ అనలేదు.

మాటల్లో పడి దూరం మర్చిపోయి నుయ్యి దగ్గరకొచ్చారు. నూతి దగ్గర చాలా జనమున్నారు. నుయ్యి విశాలంగా వుంది. నూతి కెదురుగా కోవిల తలుపులు తెరచున్నాయి. లోపల శివలింగం కనిపిస్తోంది. లింగానికి ఏడు పడగల పంచ లోహాల పాముగొడుగులా కాసుంది.

'లక్ష్మయ్య' కావిడిదించి రెండు చేతులు జోడించి దండం పెట్టాడు. మిగిలిన వాళ్ళు కూడా దండాలు పెట్టుకున్నారు.

'పెళ్ళోళ్ళకి ముందల తోవొగ్గేయండి' అని ఎవరో అనడంతో అంత వరకూ నీరు తోడు కుంటున్నోళ్ళు తప్పుకున్నారు.

ఒక్కసారి నూతిలోకి చూసాడు 'లక్ష్మయ్య'. కళ్ళు గిర్రున తిరిగినట్టు అయినాయి. నీరు ఎక్కడుందో ఓ క్షణం కనిపించలేదు. బాగా చూసేసరికి నీడలా నీళ్ళు కనిపించాయి. నీళ్ళు చూసి నుయ్యిని తాకకుండా బైటకొచ్చేసాడు 'లక్ష్మయ్య'.

తోడేవాళ్ళు నీళ్ళు తోడేసారు. బిందెలన్నీ నిండేసరికి అరగంట పట్టింది. బరువుతో ఇసుక దారిన నడుస్తుంటే నడవటం కొంచెం కష్టంగా వుంది. పాదాలు ఇసుకలో దిగిపోతున్నాయి.

అయినా కష్టంగానే మోసారు.

నాలుగుసార్లు తిరిగేసరికి ముందుగా 'లక్ష్మయ్య' ప్రాణం వాపొచ్చింది. ఆ తరువాత ఇంకోరెండు మార్లుకు కిష్టయ్య కూడా డీలా పడిపోయాడు.

'ఇదేటయ్యోయ్''... అని రంగడు ఎగతాళి చెయ్యబోయాడు అప్పుడు కిష్టయ్య చెప్పాడు.

''పెళ్ళికి పిలిసి సాయం సెయ్యమన్నారని సేస్తన్నాముగానీ ఈ సాకిరీ యెవులు సేస్తారు? పొద్దుట్నుండీ ఒక్కలాగ భుజం కాలీనేదు. మా వూరు నుండి ఒకొక్కలం బస్తాడేసి బియ్యం మోసిమోసి అలిసొచ్చినాం. కాసిన్ని మంచినీలు కూడా మరియాద సెయ్యనేదు సరికదా పెదవి యిప్పి ఒక మంచి మాటైనా అనలేదీ పెద్ద బావులు. మరికన సెయ్యలేము బాబూ ... ఆయన మీద ఇది కొలిదీ సేసినాం. సేసింది సేనా అయిపోనాది సేనాలు సాలొచ్చాయి'' అంటూ కావిడి దించేసేడు కిష్టయ్య.

రంగడికి నిజంగానే జాలేసింది. 'పోన్లే తిన్నాక మోతుమ' అని చెప్పాడు.

''తిన్నాక మోస్తామో వేదో గానీ ఇల్లీ బిందెలు సూసుకో... మాము అలాగ యెళ్ళొస్తాము'' అంటూ 'లొండా లక్ష్మయ్య' బిందెలు రంగడికి అప్పజెప్పి వీధిలోకి వచ్చేశాడు.

ముఖం తుడుచుకుంటూ కిష్టయ్య కూడా లక్ష్మయ్యను అనుకరించాడు.

తెల్లారి 'పకాలి' తిండం అలవాటున్నోళ్ళు కావడంతో ఆకలి భరించలేకపోయారు. ఏదైనా తింటే బాగుంటుందని అనుకొని వూరు చివర్లో టిఫిన్ కొట్టుకెళ్ళాలని బయల్దేరారు. పెళ్ళికొచ్చి కొట్టులో తింటే, పెళ్ళి వాళ్ళకి అమర్యాదగా వుంటుందని వెళ్ళినోళ్ళంతా తిరిగి వచ్చేశారు.

పెళ్ళి లోగిల్లో చాలా మార్పులు జరిగి పోయాయి. మైకులు బిగించడం, షామియానాలు మేడపైనా వాకిట్లోనూ కట్టడం, జోలిపొయ్య వెలిగి వంటలు వార్చటం జరిగిపోయాయి.

ఎండ తీవ్రత ఎక్కువైంది. పెదనాయుడు హడావిడిగా జోరుగా తిరుగుతున్నాడు. 'ప్రధానం' బండి వచ్చింది. సందడి పెరిగింది.

రాత్రి ఒంటి గంటకి లగ్నం కావడంతో అందరికీ 'డిన్నర్'కే చెప్పారు. వచ్చి పోయే వాళ్ళు అల్పాహార విందు స్వీకరించి వెళ్తున్నారు ముందుగా వచ్చేసి వున్న బంధువులకూ పని చేస్తున్న వాళ్ళకూ మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు.

పన్నెండున్నరయింది. 'లక్ష్మయ్య' ముఖం వాడిపోయింది. ఎంత ఉత్సాహంతో బయల్దేరాడో కానీ ఆ ఉత్సాహమంతా నీరు కారిపోతోంది. పరుశురాం గోరు కనీసం ఒక్క ముక్క మాటైనా అనకపోయేసరికి మరింత వుత్సాహం పడి పోయింది.

మధ్యాహ్న భోజనాలు గదుల్లో ఏర్పాటు చేశారు. భోజనాలు కాని వాళ్ళందరినీ పిలిచారు. అందరితోపాటుగా 'లక్ష్మయ్య' కూడా గదిలోకి వెళ్ళాడు.

'లక్ష్మయ్య'ను గదిలో చూసిన పెదనాయుడు కళ్ళు ఎర్రబడ్డాయి. గదిలోకి అడుగు పెట్టాడో లేదో ...

''అరేయ్ 'లొండా'! కసింత ఇలగ రమ్మి! నీవు తరవాత తిందువు గాని'' అని ఏదో పని చెప్పాడు పెదనాయుడు.

లక్ష్మయ్యకు ఆకలి వేస్తోన్నా పరుశురాం గారు ప్రక్కనుండటంతో పెదనాయుడుకి ఎదురు చెప్పలేక చెప్పిన పని చేశాడు.

పని పూర్తి చేసిన తరువాత భోజనానికి వెళ్ళాడు.

గదుల్లో భోజనాలు పూర్తిచేసేశారు. గదుల్లో తిన్న వాళ్ళందరకూ టేబుల్స్ వేసి భోజనాల పెట్టారు. 'లొండాడు' వెళ్ళేసరికి నేలపైన పల ఆకులున్నాయి. పదింటి ముందు పదమంది పని వాళ్ళున్నారు. ఒక ఆకు వేరే వేసుంది. 'లక్ష్మయ్య'ను దాని ముందు కూర్చోమన్నారు.

'లక్ష్మయ్య' తప్పనిసరై భోజనం ముద్ద కలి పాడు.

పరుశురాంగారు అటుగా వచ్చారు. వడ్డవల్లో తేడాలు గమనించి కూడా ఏమీ అవలేదు.

యమ్మెల్యే గారు చూసి కూడా ఏమీ అవ లేదని మరి కొంచెం బాధపడ్డాడు. పెద్దోళ్ళ మాటలకీ. చేతలకీ ఎంత తేడా వుందో కళ్ళకు కని పించింది 'లక్ష్మయ్య'కి. ముద్ద నోట్లో పెడు తుంటే ఏడాది క్రితం పరుశురాంగారు రామరాజ పురం వచ్చిన రోజు గుర్తొచ్చింది.

ఆ రోజు పరుశురాంగారూ ఇంకో పెద్ద లీడరూ కలసి జీపులో వచ్చారు. వూరులో మీటింగు పెట్టారు. హరిజనవాడలో ప్రత్యేకంగా మీటింగు పెట్టారు. భోజనాలు హరిజనవాడ లోనే చేస్తామన్నారు. 'మాకు వీళ్ళా వాళ్ళా అని భేదం లేదు. ప్రజల మనుషులమని' చెప్పారు. అలాగే హరిజనవాడలో భోజనాలు చేశారు.

అప్పుడు 'లొండాడు' ఎంతో ఆనందపడ్డాడు. అప్పుడు పరుశురాం గారంటే అభిమానం పెరి గింది.

వాళ్ళ మాటల్లో చెప్పాలంటే — ''..ఆలకి అన్నమొండి యెట్టడానికి మాము అదొక రకమై పోనాము. మా దగ్గిరేటుంతాది సోడంబలి తప్ప. ఆల దగ్గిర తిని బతికినోళుం. మాకాడ కొచ్చి తింతామంతే మాము ఇబ్బంది పడ్నాము'' అంటూనే తిండి పెట్టారు.


'లొండాడు' ప్రక్కనే పరుశురాం కూర్చొని తిన్నారు. రెండే రెండు ముద్దలు తిని కడుపులో బాగులేదని లేచిపోయారు. ఊరిలోని నాయుళ్ళు ఎవరూ రాలేదు. కూరలు పెదనాయుడు. పచ్చళ్ళు సింహాద్రి నాయుడు పంపించారు.

భోజనాలు అయిన తరువాత చాలా విష యాలు చెప్పారు.

''మీ పంచాయతీ ప్రసిడెంటు పదవి హరిజను లకు ప్రభుత్వం కేటాయించింది. మీలో ఎవరో ఒకరు ప్రసిడెంటుగా వుండాలి'' అని అడిగారు.

తరువాత ఇంకొకరు మాట్లాడి మీలోని వాడు ప్రెసిడెంటు అయితే మీకే మేలు జరుగు తుందని, అట్టడుగువర్గాలలో వున్నోళ్ళని పైకి తేవాలనే ఈ రిజర్వేషన్లు ఇచ్చారు కాబట్టే దాన్ని మీరంతా వినియోగించుకోవాలని చెప్పారు.

ప్రెసిడెంటు కోసం ఎవరు నిల్చొంటారో చెప్పండని అడిగితే తడుముకోకుండా పెద



## మౌస్ టాక్స్

జావాలోని పడమటి ప్రాంతమైన 'సువికాఫ్'లో ఎలుకల బాధ భరించలేక అక్కడి ప్రభుత్వం వారు ప్రజలపై 'మౌస్ టాక్స్' విధించారు. పెళ్ళి చేసుకుంటే 50 ఎలుకలు, ఒక ఎకరం పొలంలో పంట వేసుకోవాలంటే 75, ఏదైనా వ్యాపారం చేసుకోవాలంటే 100 ఎలుకలు. ఇలా ఒకో పనికి ఒకరకమైన టాక్సుగా ఎలుకల్ని సజీవంగాగాని, నిర్జీవంగా గాని పట్టి ఇవ్వవచ్చు.

— ఎస్. రమేష్ చక్రవర్తి, వి. సావరం.


పటిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్

నాయుడు చెప్పేసాడు. వెనకటికి వాళ్ళ కింద పాలేరుగా చేసిన 'లొండ లక్ష్మయ్యే' అన్ని విధాలా తగువని.

అందరూ పెదనాయుడు అభిప్రాయంతో ఏకీభవించారు. ఆ విధంగా 'లక్ష్మయ్య'ను రామ రాజపురం ప్రెసిడెంటును చేశారు.

పంచాయతీ ప్రెసిడెంటువైనా ఇక్కడ ఈ పంచన తినే గతి తప్పలేదని గట్టిగా ముద్దైనా పెట్టకుండానే లేచిపోయాడు 'లక్ష్మయ్య'. తన విస్తరి తనే ఎత్తుకొని దూరంగా పెరటి పెంటలో విసిరేశాడు. మౌనంగా తలవంచుకు వచ్చేశాడు.

'లక్ష్మయ్య' తలలో ఎన్నోఆలోచనలు తిరుగుతున్నాయి.

—''కులం పట్టింపులున్నోడు ఎందుకు పిలవాలి? పిలవకపోతే మేము రాకపోయుంటిమి కదా! నే నేమైనా పిలవమని చెప్పానా? పరుశురాం కనీసం పెదవి విప్పి మాట్లాలేదు. అంతే — ఎలాగైనా పెద్దోళ్ళు పెద్దోళ్ళు ఒకటే!''

—''పదవులిచ్చి పెద్దోళ్ని చేద్దామనుకున్నా పేదోళ్ళు పెద్దోళ్ళు కాలేరు. పేదోళ్ళు పేదోళ్ళే అని చెప్పడానికి సేనామంది వున్నారు.''

—''ఇక్కడ మర్యాదివ్వనేదనే కాదు. నాకు పద వొచ్చి ఏడాది గడిచినా నేనేటి సేసుకున్నాను? పేట జనం కోరికపైన కాలనీకి వూరు పక్కనే స్థలం ఇమ్మని నేనడిగితే అది జిరాయితీ భూమని వూరికి దూరంగా కోలనీ కట్టారు. అక్కడ మరి ప్రజల మాటా నెగ్గలేదు. ప్రెసిడెంటైనా నా మాటా నెగ్గలేదు. పరపతి, డబ్బు నెగ్గేసింది. పెద్దనాయుడు చెప్పినట్టే కాలనీ కట్టారు.''

ఏ పనీ 'లొండ లక్ష్మయ్య' చెప్పినట్టు వాళ్ళ పంచాయతీకి జరుగలేదు. పంచాయతీకి సంబంధించి ఒక అధికారి వచ్చినా ముందుగా పెద నాయుడు ఇంటి దగ్గరికే వెళ్తారు. 'లక్ష్మయ్య'ను అక్కడికి పిలిపించుకుంటారు. కొన్నిసార్లు పిలవమా పిలవరు. పెద నాయుడే అన్నీ చక్కపెట్టేసి తరువాత ఎప్పుడో సంతకాలు పెట్టించుకుంటారు. అడగటానికి వీలు కాదు. డబ్బు, దర్పం అన్నింటా నెగ్గేస్తాయి.

''ఏటి సేస్తన్నావ్...'' అన్న పెద నాయుడు కేకతో వర్తమానానికి వచ్చాడు 'లక్ష్మయ్య'.

''నీలు కెళ్ళండ్రా...'' అన్నాడు.

'ఆ' అని అన్నాడే కానీ 'లొండ'డికి వెళ్ళ బుద్ధి కాలేదు. నీరసంగా వుంది. ఆకలిగా వుంది. హృదయం కుతకుతా వుడుకుతోంది. ఆలో చిస్తూనే వీధిలోకి వెళ్ళాడు.

అతిథులు వచ్చీ పోతున్నారు. పెళ్ళి వరకూ వుండాల్సిన వారు వరండాలోనో, షామియానా క్రిందనో బాతాకానీ కొడుతున్నారు. జనం బాగా నిండిపోయారు.

''మల్లా నీలు కెల్తన్నాము'' అని కిష్టయ్య వొచ్చాడు.

''నాను మొయ్యను'' అన్నాడు లక్ష్మయ్య.

''పోల్లే ... మాము మరో రెండుసార్లు మోసేస్తాము'' అని కిష్టయ్య వెళ్ళిపోయాడు కావిడి వూపుకుంటూ.

సూర్యుడు వాలిపోతున్నాడు. లైట్లు వెలిగించారు. దీపాలు కళ్ళు మిరుమిట్లు గొల్పుతున్నాయి. ఎక్కడెక్కడ్నుండి వూరిపోతున్నారో జనాలు – తెగ వచ్చేస్తున్నారు. 'లక్ష్మయ్య' అంతా చూస్తూ వుండిపోయాడు.

ఐదారు కార్లు, రెండు మూడు జీపులూ ఒక్కసారి దూసుకువచ్చాయి. మినిస్టరు గారు, కలెక్టరు గారు ఇంకా కొంతమంది పెద్ద రాజకీయ నాయకులూ వచ్చారు. వాళ్ళు రావడంతో గొడవ ఎక్కువైంది. చాలామంది వాళ్లను చూసేందుకు పనులు మానేసి వెళ్ళారు.

పరుశురాంగారు హృదయపూర్వకంగా వాళ్ళని ఆహ్వానించారు. పెళ్ళి పందిర్నీ, పెళ్ళి కొడుకునీ, పెళ్ళి కూతుర్నీ చూపించారు. పెళ్ళి పీటల పైన కూర్చుండ పెట్టకుండానే పెళ్ళి పిల్లల్ని ఒక్క దగ్గర పెట్టి మంత్రిగారు మిగిలిన వి.ఐ.పి.లు అక్షింతలు వేశారు.

వాళ్ళంతా వెంటనే వెళ్ళిపోవాలట. అందుకు మూర్తాలు ఏమీ లేకుండానే దీవించేశారు బిజీ మనుషులు. ఒక్కసారి లోగిలంతా తిరిగేసి కాఫీలు తీసుకొని పావుగంటలో వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళిన తరువాత వానకురిసి వెలసినట్టయింది. అక్కడ మిగిలి వున్నోళ్ళంతా కుర్చీల్లో కూర్చొన్నారు. వివిధ రంగాలపైన, రాజకీయాల పైన చర్చలు సాగుతున్నాయి. ప్రెసిడెంట్లు ఎమ్మెల్లేలు, జిల్లా నాయకులు వున్నారు.

'లక్ష్మయ్య' ఇటూ, అటూ చూస్తూ ఆలోచిస్తున్నాడు.

'ఎంత తేడా! మినిష్టరిదీ నా కులమే కానీ ఆయనకిచ్చిన మర్యాదలో ఒకటో వంతైనా నాకిచ్చారా! ఎంతైనా డబ్బు, పరపతే మనిషి మర్యాదను నిర్ణయిస్తాయి గావాలి! నేను పేద ప్రెసిడెంటుని. అందుకని పలకరింపుకు కూడా నోచుకోలేదు' అని అనుకుంటున్నాడు.

'లక్ష్మయ్య'కు అందరిలో కూర్చోవాలనుంది. అందరితో పెళ్ళి పందిరి దగ్గరకు వెళ్ళాలనుంది కానీ పెద నాయుడు ఏమంటాడోననే భయం మనసులో పీకుతోంది.

''లక్ష్మయ్యా! ... రారా ...'' అని ఓ ప్రెసిడెంటు పిలుపు విని అటుగా వెళ్ళాడు. వాళ్ళంతా వరండాలో కూర్చొని వున్నారు. వరండాలోనికి వెళ్ళడానికి ధైర్యం చాలడం లేదు. వెళ్తే పెద నాయుడు ఏమంటాడోనని అనుకుంటూనే మళ్ళీ ధైర్యం తెచ్చుకుని 'నేనూ ప్రెసిడెంటునే కదా!' అనుకొని వెళ్ళాడు.

వరండాలోకి వణుకుతూనే అడుగేశాడు. తువ్వాలు మడిచి భుజంపైన వేశాడు. మొల్లో దోపుకున్న పంచె కాళ్ళ వరకూ లాగాడు. కొంత మంది ఏమీ పట్టించుకోలేదు. కానీ మరి కొంత మంది మాత్రం లక్ష్మయ్య వంక మరమరా చూశారు.

ఆహ్వానించి నాయన కుర్చీ చూపించాడు. 'లొండాడు' వినయంగా కూర్చున్నాడు. కుర్చీలో కూర్చోగానే కొంత హోదా వచ్చినట్టు అయింది లక్ష్మయ్యకు. అప్పటి వరకూ రగిలిన మనసులోని బాధ కొంత సద్దుమణుగుతూ వుంది.

ఇంతలో పెదనాయుడు అక్కడ కొచ్చాడు. పెదనాయుడు వచ్చినా కుర్చీనుంచి లేవలేదు 'లక్ష్మయ్య'.

''అరె. లొండా! నీవిక్కడున్నావా?... నీళ్ళు మొయ్యనేదా?'' అడిగాడు కొంచెంతీవ్రస్థాయిలో.

లక్ష్మయ్య జవాబివ్వలేదు. పెద్దనాయుడు అక్కడున్న వాళ్ళందరినీ ఓ మారు చూసి ఏమీ అనలేక వూరుకుండిపోయాడు.

'వరండాలోనికొచ్చి కుర్చీ మీద కూకున్నం. తోడివైపోనావురా మా. కొడక' అనుకున్నాడు నాయుడు.

అతడా మాటలు బయటకు అనకపోయినా ఆ చూపుల్లోనే చదువుకున్నాడు 'లక్ష్మయ్య'.

అప్పుడే సద్దుమణిగి అణిగిపోతున్న బాధ పెద నాయుడు చూపుతో పాము పడగలా విప్పుకుంది లక్ష్మయ్య మనసులో...

'నేదు బాబూ ... నేదు – మామెక్కడ పెద్దోళమైనాము. పెద్దోళమయితే, నీ నోటి మాటలాగే నీ చూపు కూడా నీలోనే మాసిపోదా?!' అనుకున్నాడు లక్ష్మయ్య.

◆